

Registered No : APTEL/25/A0818


ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శుక్రవారం 02-10-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :106 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

బీసీ రిజర్వేషన్లపై బిగ్ ట్విస్ట్!



హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు అప్పీల్

50 శాతం పరిమితిపై హైకోర్టు అభ్యంతరం

34 శాతం కోటాకు ప్రభుత్వం కట్టుబాటు

ఉన్నతాధికారులతో చంద్రబాబు కీలక సమీక్ష

బీసీలకు సముచిత ప్రాధాన్యమే లక్ష్యం

బీసీ హక్కుల పరిరక్షణకు చర్యలు కొనసాగింపు

2 లో

“అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే”

ఈసీలో విభేదాలపై క్లారిటీ

ఎస్ఐఆర్‌పై ఈసీ వివరణ

ఓటర్ల జాబితాపై ఈసీ స్పష్టత

గోవాలో 88 పేర్లు పునరుద్ధరణ

బేలా ఎస్టేట్ ఓట్లపై వివరణ

ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్తంగా నిరసనలు



2 లో

న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): ఎన్నికల సంఘంలో విభేదాలు తలెత్తాయని, ముగ్గురు కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నట్లు వార్తలు రావడంతో దేశవ్యాప్తంగా ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. అయితే, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో , 2025 ఫిబ్రవరి 19 నుంచి ఏ ఎన్నికల కమిషనర్ కూడా ఏ నిర్ణయంపైనా విభేదించలేదని ఎన్నికల సంఘం వర్గాలు గురువారం తెలిపాయి. “ఏకగ్రీవం”గానే ప్రతీ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ తెలిపింది. మరణించిన, నకిలీ, మోసపూరిత, వేరే చోటికి వెళ్ళిపోయిన ఓటర్లను గుర్తించడం, అలాగే అర్హులైన ఓటర్లందరూ ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటమే సర్ ప్రధాన లక్ష్యమని ఈసీ చెబుతోంది.

ప్రధాన ఎన్నిక కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలోని ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలను మిగతా ఇద్దరు కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు తమ అంగీకారం తెలిపిన తర్వాతే చేపట్టినట్లు ఈసీ వర్గాలు చెబుతున్నాయి.

ఈసీ కార్యాలయాన్ని తగలబెడతాం

ఈసీపై దానం నాగేందర్ ఫైర్

ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆగ్రహం

ఈసీ--బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపణ

20 వేల ఓట్లు తొలగించారంటూ విమర్శ

‘ఓట్ చోరీ’పై దానం సంచలన వ్యాఖ్యలు

తొలగించిన ఓట్లు పునరుద్ధరించాలని డిమాండ్

నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

2 లో

శీతాకాలంపై ఎల్‌నినో ఎఫెక్ట్!

ఎల్‌నినోతో ఈసారి వేడి శీతాకాలం

చలితీవ్రత తక్కువగా ఉండే ఛాన్స్

అక్టోబరులో అధిక పగటి ఉష్ణోగ్రతలు

13 శాతం లోటుతో వర్షాకాలం ముగింపు

దక్షిణాదికి సాధారణ వర్షపాతం అంచనా

అక్టోబర్--డిసెంబర్‌లో వానలపై ఊరట

వేగంగా బలపడుతున్న ఎల్‌నినో

2027 ఆరంభం వరకు ప్రభావం?



2 లో

న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగిసిందని భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది వర్షాకాలం మొత్తంగా 13 శాతం లోటు వర్షపాతంతో ముగిసిపోగా గురువారం నుంచి శీతాకాలం ప్రారంభమైంది. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈ శీతాకాలం హాట్ హాట్‌గా ఉండబోతోందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

హాస్టల్ బాలికపై లైంగిక దాడి

ఒంగోలులో హాస్టల్ బాలికపై లైంగిక దాడి

వంటమనిషి ద్వారా ఇంటికి పంపిన బాలికలు

బాలికలతో వెంకట్రావు అసభ్య ప్రవర్తన

మరో బాలిక సమాచారంతో వెలుగులోకి ఘటన

నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

వెంకట్రావుపై పోక్సో కేసు నమోదు

వార్డెన్‌కు షోకాజ్.. వంటమనిషి సస్పెన్షన్

2 లో

ఫామ్-6 మార్పులపై రాహుల్ ప్రశ్న!

ఫామ్-6 మార్పులపై రాహుల్ గాంధీ ప్రశ్నలు

ఆన్‌లైన్ ఫామ్-6ను ఎవరు మార్చారంటూ నిలదీత

బీసీఎస్‌కు ఆదేశాలు ఎవరిచ్చారంటూ ప్రశ్న

మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారన్న రాహుల్

ఈసీ కమిషనర్ల అభ్యంతరాలపై చర్చ

డిక్లరేషన్ ఫారాన్ని ఈసీ ఉపసంహరణ

ఫామ్-6 మార్పులపై కొనసాగుతున్న వివాదం

2 లో


కరువుపై కేబినెట్ బిగ్ డెసిషన్!



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో పరిస్థితులపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ అంశంపై సుదర్ఘంగా చర్చించి...

2 లో

తెలంగాణ ఓటర్లకు కీలక అలర్ట్



2 లో

ఫామ్-6కు డిక్లరేషన్ తప్పనిసరి

92 లక్షల మందికి నోటీసులు


65 లక్షల మంది స్పందన

54 లక్షల ఓట్లు తుది జాబితాలో

ఇంటివద్దకే బీఎల్‌వోల సేవలు

నవంబర్ 5తో నోటీసుల ప్రక్రియ పూర్తి

గడువు మరోసారి పెంచేది లేదన్న సీఈవో



ప్రభుత్వం కాదు పౌరుడే ఫస్ట్!

- యూపీఎస్సీకి 100 ఏళ్ల ఘన చరిత్ర
- ‘నేషన్ ఫస్ట్.. సిటిజన్ ఫస్ట్’
- సివిల్ సర్వీసుల్లో కొత్త ప్రమాణాలు
- ‘మై-బాప్’ భావనకు మోదీ చెక్
- పౌరుడే కేంద్రంగా పాలన
- ప్రజాసేవే లక్ష్యంగా ఎంపికలు
- పటేల్ సేవలను గుర్తుచేసిన మోదీ
- నేతాజీ ప్రస్థాపనపై ఆసక్తికర వ్యాఖ్యలు
- ట్రస్ట్.. ట్రాన్స్‌పరెన్సీ.. టెక్నాలజీ మిగతాది 2 లో..

న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం శతాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించారు. ‘నేషన్ ఫస్ట్.. సిటిజన్ ఫస్ట్’ అనే రెండు ప్రమాణాలను సివిల్ సర్వీసుల నియామకాల్లో గుర్తుంచుకోవాలని సూచించారు. యూపీఎస్సీ 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. శతాబ్ది వేడుకల్లో భాగంగా ప్రధాని మోడీ స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.

యూపీఎస్సీ శతాబ్ది ప్రయాణంలో తరాలు మారాయని, ప్రభుత్వ వ్యవస్థలు, సాంకేతికత, సిలబస్‌లో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ సంస్థపై ప్రజల్లో నమ్మకం కొనసాగుతోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

ఖైరతాబాద్ బైపోల్‌కు బ్రేక్?

హైకోర్టును ఆశ్రయించిన విజయారెడ్డి

నోటిఫికేషన్ నిలిపివేయాలని పిటిషన్

పాత ఎన్నికల పిటిషన్‌పై తుది తీర్పు

ఈసీ, దానం నాగేందర్ ప్రతివాదులు

అఫిడవిట్‌పై విజయారెడ్డి ఆరోపణలు

దానం ఎన్నిక రద్దుకు డిమాండ్

వచ్చే మంగళవారం హైకోర్టు విచారణ



2 లో

న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): ఖైరతాబాద్ ఉప ఎన్నిక విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇక్కడ ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని కోరుతూ పీజేఆర్ కుమార్తె, కాంగ్రెస్ నేత విజయారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2024లో తాను దాఖలు చేసిన పిటిషన్ పై తుది తీర్పు వచ్చే వరకు ఖైరతాబాద్ ఉప ఎన్నిక నిర్వహించే ప్రక్రియను నిలిపివేయాలని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌లో ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారణను వచ్చే మంగళవారానికి హైకోర్టు వాయిదా వేసింది.

‘నో యూపీఐ డే’ రద్దు!

సమ్మె నిర్ణయాన్ని వెనక్కి


నిర్మలతో భేటీ సక్సెస్

ట్రేడర్ల డిమాండ్లకు సానుకూల స్పందన

ఎండీఆర్ విధింపుపై కీలక చర్చ

జీరో ఛార్జెస్ పరిమితి పెంపు డిమాండ్

అక్టోబర్ 2న యూపీఐ సేవలు యథాతథం



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): యూపీఐ పేమెంట్స్‌పై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా తలపెట్టిన ‘నో యూపీఐ డే’ నిరసనను ట్రేడర్స్, బిజినెస్ అసోసియేషన్లు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన కీలక సమావేశం విజయవంతం కావడంతో ట్రేడర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు.

యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండకూడదని, ఎండీఆర్ విధింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెకు వర్తక సంఘాలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ అంశంపై స్పందించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వర్తక సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు.

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 02-10-2026

ఈసీ కార్యాలయాన్ని తగలబెడతాం



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తన వైఖరి మార్చుకోకపోతే ఈసీ కార్యాలయంతో పాటు హైదరాబాద్ నగరాన్ని తగలబెడతామని ఆయన తీవ్రమైన హెచ్చరికలు చేశారు. హిమాయత్ నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

బీజేపీతో ఈసీ కుమ్మక్కు.. 'ఓట్ చోరీ' ఆరోపణలు

ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ అధికారులు బీజేపీతో కుమ్మక్కై వారికి అనుబంధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కేవలం హిమాయత్ నగర్ డివిజన్‌లోనే దాదాపు 20 వేల వరకు ఓట్లను ఏకపక్షంగా తొలగించారని మండిపడ్డారు. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు వ్యవస్థీకృతమైన 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని విమర్శించారు. తన నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరి ఓటును కాపాడుకునే పూర్తి బాధ్యత తనపై ఉందని దానం స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా స్థానికంగా ఉంటున్న ప్రజల ఓట్లను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తక్షణమే పునరుద్ధరించాలి..

ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి, తొలగించిన ఓట్లను యథావిధిగా పునరుద్ధరించాలని దానం నాగేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసనలు, పోరాటాలు మరింత ఉధృతంగా ఉంటాయని, ప్రభుత్వానికి, ఈసీకి వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖైరతాబాద్ బైపోల్‌కు బ్రేక్?

మొదటి పేజీ తరువాయి

అఫిడవిట్ పై కోర్టుకు విజయారెడ్డి: 2023 శాసనసభా ఎన్నికల్లో ఖైరతాబాద్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థిగా పీజేఆర్ కూతురు విజయారెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో విజయారెడ్డి దానం నాగేందర్‌పై 22,010 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఎన్నికల అఫిడవిట్?లో దానం తన భార్య, ఆధారపడిన వారి ఆస్తులకు సంబంధించిన కీలక సమాచారాన్ని దాచిపెట్టారని ఆరోపిస్తూ విజయారెడ్డి హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని ప్రకటించి, ఆయన ఎన్నికను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ పై విచారణ కోర్టులో పెండింగ్ లో ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవిపై తెలంగాణ హైకోర్టు వేటు వేసింది. హైకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతయ్య ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ గత శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. త్వరలోనే ఈ స్థానానికి ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ క్రమంలో విజయారెడ్డి తన పాత పిటిషన్ పై మరోసారి కోర్టును ఆశ్రయించడం.. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణలో ఎలాంటి నిర్ణయం ఉంటుంది అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

బీసీ రిజర్వేషన్లపై బిగ్ ట్విస్ట్!



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టు ను ఆశ్రయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వేషన్ల కోటా 50 శాతం పరిమితిని దాటుతుందనే కారణంతో హైకోర్టు గతంలో ఆ జీవోలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు సుప్రీంకోర్టులో వెంటనే అప్పీలు చేయాలని అధికారులను ఆదేశించారు.

బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నాం.. సీఎం చంద్రబాబు

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తదనంతరం అనుసరించాల్సిన న్యాయపరమైన అంశాలపై సీఎంచంద్రబాబు ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. బీసీల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని, 34 శాతం కోటా అమలుకు ఎలాంటి అడ్డంకులు రాకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

'నో యూపీఐ డే' రద్దు!

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో ట్రేడర్లు లేవనెత్తిన పలు డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో అక్టోబర్ 2 నిరసనను పూర్తిగా రద్దు చేసుకుంటున్నట్లుఇవ అసోసియేషన్లు ప్రకటించాయి.

ట్రేడర్ల ప్రధాన డిమాండ్లు ఇవే..

కేంద్ర మంత్రితో జరిగిన భేటీలో వర్తక సంఘాల ప్రతినిధులు ప్రధానంగా రెండు కీలక డిమాండ్లను పెట్టారు. డిజిటల్ పేమెంట్స్‌పై ప్రస్తుతం ఉన్న జీరో ఛార్జెస్ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని కోరారు. వ్యాపారుల మధ్య జరిగే లావాదేవీలను ఎండీఆర్ పరిధి నుంచి పూర్తిగా మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ట్రేడర్లు లేవనెత్తిన సమస్యలను పరిశీలించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించినట్లుగా తెలుస్తోంది. డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సహించే దిశగా, చిన్న వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లుగా సమాచారం. తెలుస్తోంది. ప్రభుత్వ సానుకూల స్పందనతో సమ్మె నిర్ణయం విరమించుకున్నట్లు ట్రేడర్ల సంఘాల నేతలు వెల్లడించారు.

"అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే"

మొదటి పేజీ తరువాయి



ఇటీవల, జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు 10 నెలల్లో 14 సార్లు అధికారికంగా తమ అభ్యంతరాలు తెలిపినట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించడం సంచలనంగా మారింది. అయితే, ఈ నివేదిక వచ్చిన వారం తర్వాత, ఇప్పుడు అన్ని నిర్ణయాలు కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నట్లు వెల్లడైంది.

ఆరోపణలపై ఈసీ క్లారిటీ..

మరోవైపు, ఈసీపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు క్లారిటీ ఇచ్చింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు తుది ఓటర్ల జాబితాలో లేకపోవడానికి సాంకేతిక లోపమే కారణమని ఈసీ తెలిపింది. వీరిలో 88 మంది పేర్లు చేర్చినట్లు వెల్లడించింది. ఢిల్లీలోని బేలా ఎస్టేట్‌లోని 727 మంది ఓటర్ల పేర్లు తొలగించారనిర రాహుల్ గాంధీ ఆరోపణలపై స్పందిస్తూ.. అక్కడకు బీఎల్ఓ వెళ్లిన సమయంలో ఎవరూ అందుబాటులో లేరని, దీంతో ధ్రువీకరణపై సంతకాలు తీసుకోవడంలో సమస్య ఏర్పడిందని ఈసీ వర్గాలు వెల్లడించాయి.

దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియలో దాదాపు 25,000 మంది ఈఆర్ఓలు, ఏఈఆర్ఓ లు పాల్గొంటున్నారని, వారిలో ఎవరూ ప్రక్రియపై ఫిర్యాదు చేయలేదని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. ఓటర్ల మార్పులు చేర్పులు, తొలగింపు ప్రక్రియను ఎన్నికల కమిషనర్లు వ్యక్తిగతం నిర్వహించరని, ఇది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్థాయిలో వికేంద్రీకృతం అవుతాయని వివరించింది.

దేశవ్యాప్తంగా నిరసనలు..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని, ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీకి అనుకూలంగా ఓట్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ పార్టీ ఆరోపిస్తోంది. దీనిపై ముంబైలో అక్టోబర్ 02న సీజేపీ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరికొందరు నిరసనకు దిగుతున్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్ణయ ప్రక్రియలో ప్రతీ కమిషనర్ అభిప్రాయానికి విలువ ఉంటుంది. ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు ఒప్పుకుంటేనే ఏ నిర్ణయమైనా అమలు అవుతుంది. నిజానికి సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే అధికారమే లేదని నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వం కాదు.. పౌరుడే ఫస్ట్!

మొదటి పేజీ తరువాయి

ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత సివిల్ సర్వీసుల్లో చేరాలనే లక్ష్యంతో పరీక్షలకు హాజరవుతున్నారని, వారి ఆకాంక్షలతో కూడా యూపీఎస్సీ శతాబ్ది వేడుకలు ముడిపడి ఉన్నాయని అన్నారు.

సివిల్ సర్వీసుల ఎంపికకు రెండు ప్రమాణాలు

సివిల్ సర్వీసుల్లో నియామకాల విషయంలో ప్రధాని మోడీ రెండు అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. 'దేశం ముందు', 'పౌరుడు ముందు' అనే రెండు ప్రమాణాల ఆధారంగా ఎంపిక ప్రక్రియను చూడాలని సూచించారు. అభ్యర్థికి ఎంత పరిజ్ఞానం ఉందో మాత్రమే పరీక్షించే విధంగా నియామక పరీక్షలు ఉండకూడదని, ప్రజాసేవలోకి ఎందుకు రావాలనుకుంటున్నారనే అంశాన్ని కూడా పరిశీలించే విధంగా వ్యవస్థ ఉండాలని అన్నారు. ప్రజా పదవుల ఆకర్షణ కంటే ప్రజా సేవ పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రభుత్వ సేవల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

'ప్రభుత్వమే మై-బాప్' అనే భావన నుంచి 'పౌరుడే కేంద్రం' వైపు

గతంలో ప్రభుత్వం అన్నింటికీ ఆధారం అనే భావన ఉండేదని ప్రధాని మోడీ ప్రస్తావించారు. ఇప్పుడు పాలనా విధానంలో పౌరుడి సేవకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. 21వ శతాబ్దపు భారతదేశం కొత్త వర్క్ కల్చర్‌తో ముందుకు సాగుతోందని, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే నిపుణులు ప్రభుత్వ సేవల్లో అవసరమని పేర్కొన్నారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను గుర్తుచేసుకున్న ప్రధాని

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని స్వేచ్ఛగా ఉంచడం మాత్రమే కాకుండా, కొత్త దేశాన్ని సమర్థవంతంగా నిర్వహించడం కూడా పెద్ద సవాలుగా నిలిచిందని ప్రధాని మోడీ అన్నారు. దేశ పునర్నిర్మాణానికి అవసరమైన పరిపాలనా వ్యవస్థను నిర్మించడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని, స్వతంత్ర భారతదేశంలో ఈ సంస్థను ఒక ముఖ్యమైన స్తంభంగా బలోపేతం చేశారని పేర్కొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ప్రస్తావించిన మోడీ

యూపీఎస్సీ శతాబ్ది ప్రదర్శనను పరిశీలించిన సమయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సివిల్ సర్వీసుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేసుకున్నట్లు ప్రధాని తెలిపారు. ఆ కాలంలో బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ పరీక్షలో సంస్కృతం వంటి భారతీయ భాషలకు సంబంధించిన పేపర్ ఉండటం తన దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు. యూపీఎస్సీ చరిత్రలో 1926లో ఏర్పడిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి నేటి రాజ్యాంగబద్ధ సంస్థగా మారిన పరిణామం కీలకమైనది.

యూపీఎస్సీ 100 ఏళ్ల ప్రస్థానం

1926 అక్టోబర్ 1న భారతదేశంలో తొలి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడింది. అప్పట్లో ఇది సలహా సంస్థగా పనిచేసింది. అనంతరం 1937లో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా, 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)గా పరిణామం చెందింది. ప్రస్తుతం యూపీఎస్సీ రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 315 నుంచి 323 పరిధిలో పనిచేసే స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా ఉంది. సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, ఇంజినీరింగ్ సర్వీసెస్, కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్, NDA, CDS, CAPF తదితర పరీక్షలను నిర్వహిస్తుంది.

'ట్రస్ట్, ట్రాన్స్‌పరెన్సీ, టెక్నాలజీ'పై యూపీఎస్సీ దృష్టి

శతాబ్ది వేడుకల సందర్భంగా యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్ సంస్థ భవిష్యత్ దిశగా Trust, Transparency, Technology అనే మూడు అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శతాబ్ది కార్యక్రమాల్లో సివిల్ సర్వీసుల భవిష్యత్తు, పరిపాలనలో సాంకేతికత, రాజ్యాంగ విలువలు వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.

ఫ్లై దుబాయ్ ఘటనపై స్మిత్ మచ్చార్‌కు మోడీ ప్రశంసలు

ఇదే కార్యక్రమంలో ఇటీవల ఫ్లై దుబాయ్ విమానంలో జరిగిన ఘటనను కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ తీవ్ర పరిస్థితుల్లో చూపిన ధైర్యాన్ని ప్రశంసించారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో కాక్‌పిట్‌లో హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో మచ్చార్ గాయపడినప్పటికీ విమానాన్ని అదుపులో ఉంచి సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయానికి అత్యవసర ల్యాండింగ్ చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు పలు నివేదికలు తెలిపాయి. విమానంలో సుమారు 180 మంది ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ ఘటన తర్వాత ప్రధాని మోడీ మచ్చార్ కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు కూడా నివేదికలు పేర్కొన్నాయి. మచ్చార్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఫామ్-6 మార్పులపై రాహుల్ ప్రశ్న!



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేళ ఫారం-6 చుట్టూ వివాదం కొనసాగుతున్న వేళ ఇందులో మార్పులపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా మార్చారు? ఈసీ సొంత కమిషనర్లే ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మరి ఈసీఐలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు ఆ మార్పు చేయమని ఎవరు ఆదేశించారు? టీసీఎస్‌లో ఎవరు దానికి ఆమోదం తెలిపారు? అలా చేయడానికి వారిపై ఒత్తిడి తెచ్చారా? అని గాంధీ గురువారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

అసలేంటి ఈ తాజా వివాదం:

ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే ఓటర్లు ఇక నుంచీ ఫారం-6 కు అదనంగా డిక్లరేషన్ ఫారాన్ని నింపడాన్ని ఈసీ అధికారికంగా ఉపసంహరించుకుంది. అంతకు ముందు ఎస్ఐఆర్ సందర్భంగా కొత్తగా దరఖాస్తు చేసుకునే ఓటర్లు తమ తండ్రి, తాతల పేర్లను వెల్లడించాలని పేర్కొంటూ ఫారం-6కు అదనంగా డిక్లరేషన్‌ను ఈసీ జోడించింది. ఎస్ఐఆర్ సందర్భంగా తీసుకొచ్చిన ఈ నిబంధనపై ఇద్దరు కమిషనర్లు ఎస్ఎస్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరం వ్యక్తం చేశారంటూ ఓ జాతీయ పత్రికలో వచ్చిన పరిశోధనాత్మక కథనంతో ఈ అంశంపై తీవ్ర వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో 26వ తేదీన సమావేశమైన ఈసీ సర్ కోసమే ఈ ఫారాన్ని తెచ్చామని సర్ అమల్లో లేని సమయంలో 1960 నాటి ఓటరు నమోదు నిబంధనలకు అనుగుణంగా ఫారం-6ను నింపితే చాలని పేర్కొంది. అంతేకాకుండా సర్ ముగిసిన ప్రాంతాల్లో ఈసీఐనెట్ పోర్టల్, యాప్‌లతో పాటు సీఈఓ వెబ్‌సైట్ల నుండి కూడా ఈ డిక్లరేషన్‌ను తొలగించామని పేర్కొంది. ఆన్ లైన్ లో ఫారం 6 పై జరిగిన మార్పులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని రాహుల్ ప్రశ్నించారు.

హాస్టల్ బాలికపై లైంగిక దాడి!



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): ఒంగోలులో ఇరుముడి సినిమా తరహా ఘటన కలకలం రేపింది. హాస్టల్ బాలికల పట్ల వంటమనిషి అమానుషంగా ప్రవర్తించింది. వెంకట్రావు అనే రిటైర్డ్ ఉద్యోగి ఇంటికి వంట మనిషి బాలికలను పంపింది. బాలికలతో వెంకట్రావు అసభ్యంగా ప్రవర్తించడమేకాకుండా ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలికపై లైంగిక దాడిని చూసి భయపడ్డ మరో బాలిక చాకచక్యంగా స్థానికులకు సమాచారం ఇచ్చింది. దీంతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనాస్థలానికి చేరుకుని వెంకట్రావును పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హాస్టల్ ఘటనపై మంత్రి సవిత సీరియస్ అయ్యారు.

నిందితుడు వెంకట్రావుపై పోక్సో కేసు నమోదు చేశారు. హాస్టల్ వార్డెన్ తేరేసమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వంటమనిషి శారదను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. కొన్ని నెలల క్రితం ఓ వక్తి మైనర్ బాలికను హాస్టల్ నుండి తీసుకువెళ్లి తోటలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో ఓ యువకుడు వీడియో తీసి నిలదీయగా పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసులు రిమాండ్ కు తరలిస్తుండగా ఆ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు మరోసారి రాష్ట్రంలో హాస్టల్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడం సంచలనంగా మారింది.

శీతాకాలంపై ఎల్‌నినో ఎఫెక్ట్!



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగిసిందని భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది వర్షాకాలం మొత్తంగా 13 శాతం లోటు వర్షపాతంతో ముగిసిపోగా గురువారం నుంచి శీతాకాలం ప్రారంభమైంది. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈ శీతాకాలం హాట్ హాట్‌గా ఉండబోతోందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాబోయే అక్టోబర్ – డిసెంబర్ లోను చలితీవ్రత తక్కువగా నమోదుకానుందని దీంతో అక్టోబరులో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సెప్టెంబర్ మధ్యలోనే ఎండాకాలాన్ని తలపించిన వాతావరణం రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దక్షిణ భారతదేశానికి ఊరట:

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దేశంలో అత్యధిక ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండనుందని, దేశమంతటా పొడి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ దక్షిణ భారతంలో అక్టోబర్-డిసెంబర్ కాలానికి సాధారణ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొంది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు ఈ మూడు నెలల్లో దీర్ఘకాలిక సగటు(334.1 మి.మీ.) కాగా ఇందులో 88 శాతం నుంచి 122 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దక్షిణాదిలోని తమిళనాడు, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. .

రికార్డు స్థాయిలో బలపడుతున్న ఎల్ నినో:

పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల ఏర్పడే ఎల్ నినో ఈ ఏడాది అత్యంత వేగంగా విస్తరిస్తోందని ఐఎండీ హెచ్చరించింది. ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ అండ్ సొసైటీ నివేదిక ప్రకారం, సెప్టెంబర్ నాటికి సముద్ర ఉష్ణోగ్రతల్లో ంశీజ పెరుగుదల నమోదు కానుందని పేర్కొంది. ఈ తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులు శీతాకాలమంతా కొనసాగి 2027 ప్రారంభం వరకు ప్రభావం చూపే అవకాశం ఉందని వివిధ వాతావరణ సమూనాలు స్పష్టం చేస్తున్నాయి.

కరువుపై కేబినెట్ బిగ్ డెసిషన్!

న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో పరిస్థితులపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ అంశంపై సుదర్ఘంగా చర్చించి మంత్రిమండలి రాష్ట్రంలో దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణం చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాలని నిర్ణయించింది. త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న ఎల్ నినో పరిస్థితులు.. చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరించాలని నిర్ణయించారు. కరువు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు త్వరలోనే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదించాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం కేబినెట్ సమావేశం ఇంకా కొనసాగుతోంది. కాగా ఈ కేబినెట్ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 2 డీఏల అంశంపై తీపి కబురు చెప్పే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ ఓటర్లకు కీలక అలర్ట్



న్యూస్ డెస్క్, 01 అక్టోబర్ (ఇది కద నిజం): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇస్తే ఇప్పటి వరకు 65 లక్షల మంది ఓటర్లు నోటీసులకు సమాధానం ఇచ్చినట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. నవబంర్ 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని ఆలోపు మిగతా ఓటర్లను కూడా తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు హియరింగ్ అనే ప్రక్రియ ఉండేదని ఇకపై దాని స్థానంలో డాక్యుమెంట్ కలెక్ట్ చేసుకోవడమే ఉంటుందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామని, నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు.

ఇంటివద్దకే బీఎల్‌వోలు:

నోటీసులు అందినవారి ఇళ్ల దగ్గరకే బీఎల్‌వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారన్నారు. ఒక చోట కూర్చుని ఓటర్లను పిలిపించుకోవడం కుదరదని ఓట్లర్ల ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు బీఎల్‌వోలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పని లేదని ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందన్నారు. ఫారమ్-6 కు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని, తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందునా ఫారమ్-6 కు డిక్లరేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. నోటీసులు అందిన వారిలో ఎవరైనా వలస వెళ్లి ఉంటే అలాంటి వారిని పిలవాల్సిన అవసరం లేదని ఈఆర్వో ఆన్ లైన్ లోనే వారిని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలనేది ఈసీ ఉద్దేశం అన్నారు.

మరోసారి గడువు పెంపు లేదు:

సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదన్నారు. ఇప్పటికే ఓసారి గడువు పెంపుకోరామని అందువల్ల ఇది కుదరదన్నారు. ప్రస్తుతం ఉన్న గడవు ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు గడువు అక్టోబర్ 7 వరకు ఉండగా నోటీసులు జారీ/ అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 5 వరకు, తుది ఓటరు జాబితా 9 నవంబర్ న ప్రచురించనున్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 02-10-2026

మృతుడి కుటుంబానికి ఎన్టీఆర్ భరోసా అండ

- పింఛన్ అందజేసిన కూటమి నాయకులు



ఇది కద నిజం, కుక్కునూరు: కుక్కునూరు గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను అధికారులతో కలిసి కూటమి నాయకులు అందజేశారు. కుక్కునూరు గ్రామపంచాయతీ పరిధికి చెందిన ఎస్కే బాజన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు సంబంధించిన రూ.4,000 మొత్తాన్ని కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు), కుక్కునూరు మండల పరిషత్ అధికారి నాగరాజు, కుక్కునూరు మాజీ సర్పంచ్ పిచ్చుక రాజు కలిసి అయన భార్య షేక్ కాశీంకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలు, వృద్ధులు, వితంతువులు, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. మృతుడు ఎస్కే బాజన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాదం రాము, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా పోటీ చేయండి.. మీ వెంటే నేను ఉంటా..!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 01: మైదుకూరు నియోజకవర్గం.. చాపాడు మండలం.. అల్లాడుపల్లె దేవలాలలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మండపం నందు చాపాడు మండల వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా ఎదుర్కొంటుందని తెలిపారు. పార్టీకి ప్రజాబలం, కార్యకర్తల బలం ఉందని, ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పాలన లోని వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అక్రమ కేసులకు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది అని నాయకులు భరోసా ఇచ్చారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కార్యకర్తల సమావేశ సందర్భంగా పేర్కొన్నారు. చాపాడు మండలంలో పార్టీని బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు ప్రజలపై నమ్మకం కోల్పోయారు అని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి విమర్శించారు. ప్రజల మద్దతుతో ఎన్నికలను ఎదుర్కొనే బదులు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిర్వహించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ పార్టీ ఐడీ కార్డులు అందజేస్తామని తెలిపారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, కేవలం మాటలు కాకుండా చేతల్లో అభివృద్ధి చేసి చూపించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా.. అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో చాపాడు మాజీ ఎంపీపీ తెలిదేల లక్ష్మమయ్య యాదవ్, మాజీ ఉప ఎంపీపీ బాల నరసింహారెడ్డి, మండల కన్వీనర్ రాజా శేఖర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లు టిఓ.పల్లె రవి శంకర్ రెడ్డి సి.వి.సుబ్బారెడ్డి మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోనసీమ జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి చెరుకూరి సాయిరామ్ పేరు పరిశీలనలో?



అమలాపురం (ఇది కద నిజం) అక్టోబర్ 1 : అమలాపురానికి చెందిన చెరుకూరి సాయిరామ్ పేరు కోనసీమ జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి సంబంధించి పార్టీ అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో సాయిరామ్‌కు సన్నిహిత సంబంధాలు, ఆయన ఆశీస్సులు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వివాదాలకు దూరంగా ఉన్న, నేర చరిత్ర లేని ప్రజల్లో సానుకూల గుర్తింపు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రతిపక్షాలకు అభ్యర్థుల గత చరిత్రను రాజకీయంగా విమర్శించే అవకాశం లేకుండా, పార్టీకి విధేయతతో పాటు ప్రజల్లో మంచి పేరు ఉన్న నాయకులను ఎంపిక చేయాలనే ఆలోచన అధిష్ఠానంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చెరుకూరి సాయిరామ్ పార్టీ పట్ల విధేయతతో వ్యవహరిస్తున్న నాయకుడిగా, పెద్దగా వివాదాలకు తావులేని వ్యక్తిగా స్థానిక రాజకీయ వర్గాల్లో గుర్తింపు పొందినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

అయితే జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు సాయిరామ్ పేరు పరిశీలనలో ఉన్న అభ్యర్థుల్లో ఒకటిగానే చూడాల్సి ఉంటుంది.

డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చొరవతో రూ.6.75 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ ప్రారంభించారు. కాలనీ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారని నాయకులు పేర్కొన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో కాలనీలో విద్యుత్ సరఫరా సమస్యలు తగ్గనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, దయానంద్, వార్డు సభ్యులు బాలకృష్ణ, మోతి, కృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేతితరం నాయకులకు బాలయోగి ఆదర్శం



రాజమహేంద్రవరం(ఇది కద నిజం)అక్టోబర్ 1: నేతితరం పాలకులకు దివంగత లోక్ సభ మాజీ స్పీకర్, మహామనిషి జి ఎం సి బాలయోగి నీ ఆదర్శంగా తీసుకోవాలని గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ అన్నారు. జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా కంబాల చెరువు పార్కులో ఉన్న ఆయన కాంస్య విగ్రహం వద్ద గన్ని కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలయోగి కాంస్య విగ్రహానికి గన్ని కృష్ణతో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్,గౌతమి జీవకారుణ్య సంఘం పాలకమండలి చైర్మన్ వర్రే శ్రీనివాసరావు,మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, దళిత నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ ఎన్నటికీ మరువలేని గొప్ప మహా మనిషి బాలయోగి అన్నారు. ఆయన 76వ జయంతి కార్యక్రమానికి భారీగా పార్టీ శ్రేణులు తరలిరావడం ఆయనలో ఉన్న మంచితనానికి నిదర్శనమన్నారు. ఆయన తమ నుంచి దూరమై 22 ఏళ్ళు గడిచినా ఆయనతో ఉన్న ప్రతిక్షణం కళ్ళ ముందు కదులుతూనే ఉంటుందని అన్నారు. లోక్ సభ స్పీకర్ గా ఎదిగినప్పటికీ సామాన్య కార్యకర్తను కూడా ఎంతో మర్యాదగా పలకరించే వారిని వారి ఇంట్లో జరిగే శు భకార్యానికి పిలిస్తే ఢిల్లీలో ఉన్నా బయలుదేరి వచ్చేవారని గుర్తు చేశారు. నేటి పాలకులు ఆయనలో ఉన్న నాయకత్వ లక్షణాలను,కార్యకర్తల పట్ల అనుసరించాల్సిన విధానాన్ని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు కార్యకర్తలు పార్టీలో గౌరవాన్ని కోరుకుంటారని ఈ సందర్భంగా అన్నారు. అందుకే ఆయన ప్రతి జయంతికి, వర్ధంతికి కంబాలచెరువు పార్కులో నివాళులు అర్పిస్తామని ఆయన చేసిన అభివృద్ధిని స్మరిస్తామని పేర్కొన్నారు. కంబాల చెరువు ప్రక్షాళనకు చేపట్టిన శ్రమదానంలో ఆయన కూడా భాగస్వామిగా నిలిచారని, అందుకే ఆయన కాంస్య విగ్రహాన్ని ఈ పార్కులో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కంబాల చెరువు పార్కు మళ్ళీ దుర్గంధంగా మారిందని విమర్శలు వస్తున్న నేపథ్యంలో పాలకులు దానిపై దృష్టి సారించి ఆహ్లాదకరంగా మార్చాలని సూచించారు. రాజకీయ జీవితంలో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి కానీ పదవీకాలంలో మనం చేసే మంచి పనులు అనుసరించే విధానం ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని గన్ని కృష్ణ అన్నారు.

సామాన్య కార్యకర్త నుండి లోక్‌సభ స్పీకర్ గా ఎదిగినా ఆయన ఒదిగి ఉండే గొప్ప లక్షణం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఖరీఫ్ వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని తిమ్మానగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఖరీఫ్ 2026-27 వానాకాలం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తిమ్మానగర్-1, తిమ్మానగర్-2, మార్దండ కేంద్రాలను సంఘ పీఐసీ అధ్యక్షుడు ఎం. సాయిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు.

కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు ఎన్. సాయిలు, చి. గంగారాం, డి. రామయ్య, వి. దేవేందర్, తిమ్మానగర్ సర్పంచ్ ఎన్. ప్రవీణ్‌కుమార్, మార్దండ సర్పంచ్ వి. సాయిలు, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎం. దేవేందర్‌రెడ్డి, మాజీ సంఘ అధ్యక్షుడు ఎం. శ్రీకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పి. పండరి, పర్యవేక్షణ అధికారి విట్టల్, ఏఈఓ ప్రదీప్‌కుమార్, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికల్లో అన్ని కులాల వారికి సముచిత అవకాశం కల్పించాలి...!

వైయస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి డిమాండ్...

చైర్మన్ రిజర్వేషన్ పై రాజకీయం చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పై విమర్శలు...



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 01: రాబోయే దసరా పండుగ లోపే మునిసిపల్ ఎన్నికలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ప్రొద్దుటూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియమ నిబంధనలు, రిజర్వేషన్ ప్రక్రియ ప్రకారం ఎన్నికల్లో అన్ని కులాల వారికి సముచిత అవకాశం కల్పించాలని రాచమల్లు డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు మునిసిపాలిటీ పరిధిలో అత్యధికంగా బీసీ ఓటర్లు ఉన్నారని, జిల్లా కలెక్టర్ కూడా బీసీలకు కేటాయిస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని వెల్లడించారు. అయితే ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ బీసీలకు చెందాల్సిన ఛైర్మన్ స్థానాన్ని ఓసీ జనరల్ కు కేటాయించాలంటూ స్థానిక ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి టీడీపీ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారని రాచమల్లు ఆరోపించారు. ఒకవేళ చైర్మన్ పదవిని ఓసీలకు కేటాయిస్తే, తన సొంత తమ్ముడు రాఘవ రెడ్డికి లేదా పార్టీ కార్యక్రమాలను వ్యవహరించే మహేశ్వర రెడ్డికి కట్టబెట్టాలనే చుస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డికి ప్రజలన్నా, ప్రభుత్వ ఉద్యోగులన్న కనీస గౌరవం లేదని, పలు సందర్భాల్లో వారిని బహిరంగంగా అవమానించిన దాఖలాలు చాలా ఉన్నాయని రాచమల్లు మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పై మండిపడ్డారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా నిజాంసాగర్, మంగ్లూర్‌లో కేంద్రాలకు శ్రీకారం నిజాంసాగర్ మండల కేంద్రంతో పాటు మంగ్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించిన రైతు సేవాసమితి..!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 01: తమిళనాడు రాష్ట్రం నుండి అభివృద్ధిలో వెనుకబడిన తెలుగు ప్రాంతాల అభివృద్ధి కోసం జరిగిన పోరాటంలో అమరుడైన పొట్టి శ్రీరాములు గారిని 1953 వ సంవత్సరం అక్టోబర్ -1 న కర్నూల్ రాజధానిగా శ్రీబాగ్ ఒడంబడిక చట్టంతో అభివృద్ధి వికేంద్రీకరణ లో భాగంగా గుంటూరులో హైకోర్టు, విశాఖలో ఉక్కు పరిశ్రమ, రాజమండ్రిలో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే విధానంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కడపజిల్లా లోని మైదుకూరు పట్టణం మార్కెట్ సర్కిల్ లోని అమరజీవి పొట్టిశ్రీరాములు గారి విగ్రహానికి గురువారం రైతు సేవా సమితి నాయకత్వం పూలమాలవేసి గౌరవించడం జరిగిందని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి.రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవి.రమణ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం.. రాయలసీమ అభివృద్ధి కోసం ఏర్పడిన మూడు సంవత్సరాల లోనే 1956 వ సంవత్సరం నుండే రాయలసీమకు మళ్ళీ అన్యాయం మొదలైందని హైదరాబాదును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికేంద్రీక రించుకొని హైదరాబాద్ అభివృద్ధి కోసమే పాటుపడడం జరిగిందని, అతర్వాత మళ్లీ తెలంగాణ విడిపోయిన తర్వాత కేవలం 29 గ్రామాల అభివృద్ధి కోసమే అమరావతి పేరుతో మరొకసారి అభివృద్ధి కేంద్రీకరణ చేస్తూ ముఖ్య మంత్రులు రాయలసీమ వాసులైన రాయలసీమ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని రైతు సేవా నాయకుడు ఏవి. రమణ పేర్కొన్నారు.

ఇప్పటికైనా రాయలసీమ రైతులు, యువకులు, విద్యార్థులు రాయలసీమ ఉద్యమానికి సిద్ధం కావాలని ఏవి. రమణ కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రిన్సిపాల్ మూలే రామకృష్ణారెడ్డి, సమితి మైదుకూరు మండల కార్యదర్శి నరసింహులు, సమితి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, రైతులు సంగటి తిమ్మాయి పల్లె వెంకటసుబ్బయ్య, ముత్తులూరుపాడు వెంకట్రాముడు, సుబ్బరాయుడు, గుర్రం ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 02-10-2026


సినిమా న్యూస్



‘ఇట్లు అర్జున’ వాయిదా!

క్రేజీ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాణంలో ‘వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్’ బ్యానర్‌పై తెరకెక్కుతున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైన్మెంట్ ‘ఇట్లు అర్జున’. యంగ్ నటులు అనీష్, అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న ఈ మూవీకి మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. మనోహరమైన స్వచ్ఛమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఆకట్టుకోగా.. అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. కానీ.. తాజాగా ఈ సినిమా వాయిదా పడినట్లు తెలుపుతూ కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు.. ‘ఒక సరికొత్త ప్రేమకథ.. అందులో ఒక ఆసక్తికరమైన మలుపు.. ఇట్లు అర్జున రొమాన్స్, యాక్షన్, ఎమోషన్ అండ్ వినోదంతో వెండితెరపైకి రాబోతోంది. అక్టోబర్ 30న విడుదల కాబోతున్న అర్జునను కలవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా’ అనే క్యాప్షన్‌తో సినిమా వాయిదాను కన్ఫర్మ్ చేస్తూ కొత్త విడుదల తేదీని ప్రకటించారు. అయితే.. అక్టోబర్ విక్టరీ వెంకటేష్ ‘ఆదర్శ కుటుంబం’ సినిమా రిలీజ్ ఉండటంతో ఈ మూవీ వాయిదా వేసినట్లు ఫిలిమ్ వర్గాల్లో టాక్.

స్టార్‌డమ్ కాదు టాలెంటే ముఖ్యం!



దర్శక ధీరుడు రాజమౌళి ప్రస్తుతం ‘వారణాసి’ చిత్రంతో బిజీగా ఉన్నాడు. సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీని రాజమౌళి ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా.. ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకులకు ఈ మూవీని చేరువ చేస్తున్నాడు. ఇందులో భాగంగానే తాజాగా పెన్ స్టేట్ ఫిల్మ్‌మేకింగ్ విద్యార్థులతో సంభాషణలో పాల్గొన్న రాజమౌళి.. నటుల సెలక్షన్‌పై చేసిన కామెంట్స్ ప్రజెంట్ వైరల్ అవుతున్నాయి. ‘ఒక నటుడిని కేవలం అతను సూపర్‌స్టార్ అనే కారణంతో నేనెప్పుడూ ఎంపిక చేసుకోను. ఆ పాత్రకు నిజంగా సరిపోయే నటుడినే ఎంచుకుంటాను. ఒకసారి నటుడిని ఎంపిక చేసుకున్న తర్వాత, అతను నాపై నమ్మకం ఉంచాలని నేను ఆశిస్తాను.

ఆ పాత్రకు అవసరమైన నటనను అతని నుంచి రాబట్టేందుకు నేను మార్గనిర్దేశం చేస్తాను’ అని తెలిపారు. అలాగే మహేశ్ బాబు గురించి మాట్లాడుతూ.. ‘మహేష్ బాబు ఒక భారీ సూపర్‌స్టార్. వారణాసి కోసం నేను ఆయన నుంచి 100 శాతం పనితీరును ఆశించా. అయితే ఆయనతో కలిసి పనిచేయడం ప్రారంభించిన తర్వాత, ఆయన నా అంచనాలను పూర్తిగా మించిపోయారు. నేను ఊహించిన ప్రతిదానినీ దాటి వెళ్లి, 200 శాతం ఇచ్చారు. ఆయన ఆ పాత్రను అద్భుతంగా పండించారు. పాత్రలోకి మహేశ్ తీసుకొచ్చిన కొత్త కోణాలు నన్ను ఆశ్చర్యపరిచాయి. నేను ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువ చేశారు. అందుకే వారణాసిలో మహేష్ బాబుతో కలిసి పనిచేయడం నాకు ఎంతో ప్రత్యేకమైన అనుభవంగా మారింది’ అంటూ ఆయన అనుభవాన్ని పంచుకున్నారు రాజమౌళి.



‘మీతో నటించడం ఓ వరం’!

యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు మలయాళ ఎంట్రీకి సిద్ధం అయిన విషయం తెలిసిందే. మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ హీరోగా, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై విష్ణు మోహన్ దర్శకత్వంలో రాబోతున్న బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ‘ఆపరేషన్ గంగా – ఎ నేషన్స్ ప్రామిస్’. గోకులం గోపాలన్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, ఆర్. పార్తీపన్, ఆదిల్ హుస్సేన్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా భాగ్యశ్రీ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది. ‘మీతో కలిసి నటించడం ఒక వరంలా అనిపిస్తోంది. షూటింగ్ జరిగే ప్రతి రోజూ, మీ కళ్ళతో సినిమాను చూసే మరియు మీ నుండి నేర్చుకునే అవకాశం నాకు లభిస్తోంది... మీరు నిజంగా అద్భుతమైన ప్రతిభావంతులు, సార్’ అంటూ మోహన్ లాల్‌తో ఉన్న ఫొటోను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేసింది భాగ్యశ్రీ బోర్సే.

తమన్నా మూవీకి ఊహించని రెస్పాన్స్!



హీరోయిన్ తమన్నా, బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటించిన ది వాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్ సినిమా ఇటీవల విడుదలై ప్రేక్షకుల మందుకు వచ్చింది. అయితే ఈ సినిమాకు బీహార్‌లోని థియేటర్ లలో ఊహించని స్పందన వస్తోంది. థియేటర్‌లను ప్రేక్షకులు గుడిగా మార్చేసి పూజలు చేస్తున్నారు. చట్ పూజ వేడుకలకు అడ్డాగా థియేటర్ లను మార్చేస్తున్నారు.ఎదానికి కారణంగా బీహార్ ప్రజలు ఘనంగా జరుపుకునే పండుగ ఛఠ్ పూజకు సంబంధించిన సన్నివేశాలను ఈ సినిమాలో చూపించడమే. మరోవైపు ఈ సినిమాలో బీహార్ కోకిలగా ప్రసిద్ధి చెందిన దివంగత గాయని శారదా సిన్హా పాడిన ఛఠీ మైయా అనే భక్తి పాటను సినిమాలు పెట్టారు.

దీంతో పాట ప్లే వచ్చిన తరవాత మహిళలు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. థియేటర్ ల ముందే చెప్పులు విడిచి లోపలకు వెళుతున్నారు. అక్కడితో ఆగకుండా పూజలు చేస్తూ, థియేటర్ వద్ద ప్రసాదాలు సైతం పంచుతున్నారు. కొందరు మహిళలు అయితే ఛఠ్ పూజ సమయంలో ధరించే సంప్రదాయ దుస్తుల్లోనే థియేటర్ లకు వస్తున్నారు. మహిళలు చేస్తున్న పూజలతో బిహార్ థియేటర్ లు ఆలయాలను తలపిస్తున్నారు. సినిమాకు విశేష స్పందన రావడంతో చిత్రయూనిట్ సైతం ఆనందంలో మునిగితేలుతోంది.



ఆ కష్టాలు నువ్వు పడలేవు నాని

‘ది ప్యారడైజ్’ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ఉన్న చిత్ర బృందం ఒక స్పెషల్ ఇంటర్వ్యూలో సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ప్రస్తుతం ఈ ముచ్చట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. న్యాచురల్ స్టార్ నాని, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, యంగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కలిసి పాల్గొన్న ప్రత్యేక చిట్‌చాట్‌లో మోహన్ బాబు చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సినీ రంగంలో నిలదొక్కుకోవడం ఎప్పుడూ పూలబాట కాదు. తరాలు మారినా, సాంకేతికత కొత్త పుంతలు తొక్కినా కెమెరా ముందుకు రావడానికి పడే తపన, శ్రమ ఎవరికైనా సమానమే. అయితే నాటి మద్రాస్ సినీ సామ్రాజ్యంలో అవకాశాల కోసం ఎదురుచూసిన పాత తరం నటుల కష్టాలు వేరు.. ఇప్పటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా స్ట్రగుల్ నడుమ హైదరాబాద్‌లో ఎదిగిన నేటి తరం నటుల ప్రయాణం వేరని కలెక్షన్ కింగ్ మోహన్ బాబు అన్నారు.

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, నేచురల్ స్టార్ నాని మధ్య జరిగిన సంభాషణ ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

మద్రాస్ (చెన్నై) సినీ పరిశ్రమలో ఒక చిన్న అవకాశం కోసం చెప్పులరిగేలా తిరిగిన రోజులను మోహన్ బాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. “మేము అనుభవించిన స్ట్రగుల్, పడ్డ ఇబ్బందులు ఏ పగవాడికి కూడా రాకూడదు.. అన్ని కష్టాలు అనుభవించాం” అంటూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తిండితిప్పలు లేకుండా, సరైన ఆసరా దొరక్క ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఒక అడుగు ముందుకు వేయడానికి ప్రాణాలు ఒడ్డాల్సి వచ్చేదని ఆనాటి పరిస్థితులను వివరించారు. ఆ అనుభవాలు తలచుకుంటేనే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుందని, ఆ తరహా భయానక కష్టాలు ఏ కళాకారుడూ అనుభవించకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. నాని ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ మోహన్ బాబు ఆసక్తికర పోలిక తీసుకొచ్చారు. “నువ్వు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, నటుడిగా ఎంతో హుందాగా, గౌరవప్రదంగా పని చేసుకుంటూ పైకి వచ్చావు.. మేము పడ్డ ఆ కష్టాలు నువ్వు పడలేవు, పడి ఉండకూడదు కూడా” అని స్పష్టం చేశారు. అప్పట్లో ఒక అవకాశం దక్కించుకోవడమే మహాభాగ్యమైతే, కథాబలం, స్వచ్ఛమైన ఒరిజినల్ స్టోరీటెల్లింగ్ మాత్రమే సినిమాను బతికించేవి. కానీ నేటి తరం హీరోలకు అవకాశాల కంటే ఎక్కువ సోషల్ మీడియా నిఘా, క్షణక్షణం మారే ప్రేక్షకుల తీర్పులు పెద్ద సవాలుగా మారాయని ఇద్దరి చర్చలో తేలింది. టెక్నాలజీ పెరిగి వేదికలు మారినా.. సినీ పరిశ్రమలో నిలబడటానికి చేసే యుద్ధం మాత్రం ఆగలేదని ఈ సంభాషణ స్పష్టం చేసింది. రెండు వేర్వేరు తరాల ప్రతినిధులు ఒకే వేదికపై కూర్చుని సినిమా కష్టాలపై మనసు విప్పి మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.